గల్పిక

# ఆధ్యాత్మిక ఔన్నత్యం

దుత్తా దుర్గాప్రసాద్

("ఆధ్యాత్మికంగా చాలా గొప్పది మీదేశం" అన్నాడొక హాలీవుడ్ మానిసి మొన్న సీమధ్య మద్రాసులో!)

గ్రామంలో కలరా ప్రవేశించిందని ఊరంతా గుప్పుమంది. వణికిపోయారు జనమంతా ఏ దేవతో ఆగ్రహించిందని! ఊరిమధ్య రావిచెట్టు కింద మీటింగు పెట్టాడు పెద్దిరెడ్డి. సభ్యులంతా తీవ్రంగా చర్చించి యిదంతా "అమ్మోరి" ఆగ్రహఫలితమే నని నిశ్చయించారు. "కొలుపులు జరిగి తీరాలి సిందే" నన్నాడు వెంకిరెడ్డి. వడపప్పూ, పానకం కలకక తప్పదన్నాడు అవధాన్లు. "రెండూను" అని తేల్చేశాడు పెద్దిరెడ్డి.

ఈ మీటింగు ఇలా జరుగుతుండగానే హెల్తు ఇన్స్పెక్టరు వచ్చాడు "ఇనాక్యులేషన్" చేయించుకోమంటూ. ఆయన్ని చూడగానే పెద్దపులిని చూసినట్టు పరిగెత్తారు పిల్లలంతా! తాగుతున్న చుట్టలలా జారిపోయాయి సభ్యుల నోళ్లలోంచి! "గజగజ" వొణకడం మొదలెట్టాడు పెద్దిరెడ్డి. అంతులేకుండా పోయాడు అవధాన్లు! ఈ గండాన్నెలాగైనా తప్పించమని, ప్రార్థించారు సభ్యులంతా, అందరిలోకీ ధైర్యస్తుడూ, అనుభవశాలీ, అయిన వెంకిరెడ్డిని. ఇంతకు ముందు ఇలాంటివెన్నో చూట్టంవల్ల ధైర్యంగా లేచాడు వెంకిరెడ్డి. అలా, చాటుకు తీసుకెళ్ళి ఏదో రహస్యం మాట్లాడాడు. "అలాగే, దానికేం" అంటూ నిష్క్రమించాడు హెల్తు ఇన్స్పెక్టరు!

ఇంతలో, ఓ ముసలమ్మ పిశాచంలా లేచి, భయంకరంగా అరవడం మొదలెట్టింది. గభుక్కున, రావిమాన్ని, కావిలించుకొన్నాడు ఓబులుశెట్టి! ఇదంతా చూచి, గాభరాపడి ఘోరంగా ఏడ్చేస్తున్నాడో కుర్రాడు తండ్రి ఒళ్ళోకూచుని. పెద్దలంతా ముసలమ్మ చుట్టూచేరి నానాగొడవచేస్తూ, నిమ్మకాయలు తెమ్మనీ, నీళ్లు తెమ్మనీ, కనపడ్డవాణ్ణల్లా, కేకలేస్తున్నారు. ముసలమ్మ ఏదేదో అనేస్తోంది అర్థంకాని భాషలో! అనువదిస్తున్నాడు అవధాన్లు. చాలా కాలంనుంచి తనని మరచిపోయారట! కొలుపులూ అవీ, సరిగ్గా జరపడంలేదట! ఊరంతటినీ ఊడ్చేస్తాను, రక్తం పీల్చేస్తాను అంటోంది!

ఆ రాత్రంతా భజన జరుగుతూనే ఉంది. నిద్రలేకుండా పాడేస్తున్నాడు అవధాన్లు! "మాచెడ్డ" భక్తితో వింటూ కూర్చున్నారు, జనమంతా. ఊరంతా ఉడికిపోతోంది. ఒంటరిగా బయటికి రావడం లేదెవ్వరూ "అమ్మోరు" పట్టేస్తుందని! పిల్లలంతా ఓమూలచేరి ఎవరెవరు ఎక్కడెక్కడ ఎలాంటి దెయ్యాల్ని చూచిందీ చెప్పుకుపోతున్నారు.

ఇదిలా జరుగుతూండగానే ఊరిమధ్య, అదను చూచి, ఓ కూలివాడి పూరిగుడిసెకి నిప్పంటించేశారు పెద్దలంతా, "అమ్మోరి" శాంతికని! ఆ ఇల్లు అలావూరుకోక ఆ వీధివీధదంతా, కబుర్లాడింది! గొల్లుమన్నారు కూలివాళ్లంతా. మరిక్కడ బ్రతకలేమంటూ రాత్రికి రాత్రే పేటకెళ్ళిపోయారు మిగిలిపోయిన కుండబొచ్చెలు నాలుగూ నెత్తినెట్టుకొని ఓ యాభైమంది.

మర్నాడు చెరువుకట్టమీద రక్తం ప్రవహించింది. తృప్తిగా త్రేన్చాయి, కాకులూ, గ్రద్దలూ! బిందెలతో పానకం, తట్టలతో వడపప్పూ కలిపారు. తలోసోలెడు వడపప్పూ, తలోచెంబెడు పానకమూ కళ్ళకద్దుకుని పుచ్చుకొన్నారు. పిల్లలంతా వంతులేసుకుమరీ తాగారు.

సాయంకాలానికి తాజావార్త లందాయి. కలరా ఊళ్ళోకొచ్చేసింది. దాదాపు నలభైమందికి తగిలింది. అందులో పదిహేనుగురు అప్పుడే మరణించారు.

★